తెలంగాణ TELANGANA MUCHATLU

TELTEL12273

అనునిత్యం ప్రజల పక్షం

# ముచ్చట్లు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : పొల్లెపాక రాజేష్



విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న

తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో

పనిచేయుటకు జిల్లా బ్యూరో , స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన యువతి యువకులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9493669669, 9391230209



వరంగల్ సంపుటి : 2 సంచిక : 158 మంగళవారం 9 - 07 - 2024 పేజీలు : 08 వెల : 5


# వైఎస్ స్ఫూర్తితోనే ఆరు గ్యారంటీల అమలు

- ఆయన పాదయాత్రతోనే కాంగ్రెస్‌కు అధికారం
- పార్టీకోసం కష్టపడ్డవారికి పదవులు ఇస్తాన్నామన్న సిఎం రేవంత్ రెడ్డి
- ఆగస్ట్ 15 కల్లా రుణమాఫీ చేసి తీరుతామన్న భట్టి
- వైఎస్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నేతల నివాళి



హైదరాబాద్,జూలై8 తెలంగాణ ముచ్చట్లు : దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ నేతలు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క తదితరులు నివాళి అర్పించారు. వైఎస్ విగ్రహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళులర్పించారు. వైఎస్ఆర్ 75వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని సిటీ సెంటర్ వద్దనున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఇన్చార్జ్ దీపాదాస్ మున్షి, కేవీపీ రామచంద్రారవు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో సంక్షేమాన్ని

2లో

## ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో విచారణ శుక్రవారానికి వాయిదా




ఢిల్లీ, తెలంగాణ ముచ్చట్లు : లిక్కర్ పాలసీ సీబీఐ కేసులో డిఫాల్ట్ బెయిల్ కోరుతూ రౌస్ అవెన్యూ కోర్టులో ఎమ్మెల్సీ కవిత వేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. ఈ కేసులో ఇవాళ (సోమవారం) మధ్యాహ్నం రెండు గంటలకు విచారణ ప్రారంభం కాగా.. సీబీఐ జూన్ 7న వేసిన ఛార్జిషీట్‌లో తప్పులు ఉన్నాయని, అందుకే ఎమ్మెల్సీ కవితని రిలీజ్ చేయాలంటూ ఆమె తరఫు న్యాయవాది కోర్టును కోరారు. సీబీఐ రీఫైలింగ్ చేసిన ఛార్జిషీట్‌లోనూ తప్పులు ఉన్నాయని న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో వచ్చే గురువారం లోపు కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీచేసింది.అనంతరం కవిత దాఖలు చేసిన పిటిషన్ విచారణనను శుక్రవారానికి వాయిదా వేసింది. లిక్కర్ కేసులో కవిత పాత్రపై సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్ పరిగణలోకి తీసుకునే అంశంపై శుక్రవారం రోజున విచారణ జరగనుంది. ఎమ్మెల్సీ కవిత అరెస్టై నాలుగు నెలలు గడుస్తున్నాఆమెకు బెయిల్ మాత్రం లభించడం లేదు. దీంతో రకరకాల ప్రయత్నాలు చేస్తూ ప్రస్తుతం డిఫాల్ట్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు.

## ప్రియ ఎన్‌క్లేవ్‌లో ఇళ్ల కూల్చివేతపై ఎంపీ ఈటెల ఫైర్..



మల్కాజ్‌గిరి, తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డబ్బులు దండుకోవటం తప్ప పాలనపై ధ్యాస లేదని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ పరిధిలోని ప్రియ ఎన్ క్లేవ్‌లో పేదల ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిందంటూ ఈటెల తీవ్రంగా స్పందించారు. అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నా కూల్చివేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇలాంటి నియంతృత్వ పోకడలకు పోయే ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రెవెన్యూ మంత్రికి తెలియకుండానే అధికారులు ఇళ్లు కూల్చివేస్తున్నారా అంటూ ప్రశ్నించారు.ప్రియ ఎన్ క్లేవ్‌లో ఇళ్లు నిర్మించుకున్న వారంతా చిన్నచిన్న ఉద్యోగులు, చిరువ్యాపారులు, పేదలే అని ఈటెల తెలిపారు. ఒకవేళ

## అంబర్‌పేటలో సిసి రోడ్ల నిర్మాణం

### కొత్త ప్రతిపాదనలకు ఎమ్మెల్యే ఆదేశం

హైదరాబాద్,జూలై8తెలంగాణ ముచ్చట్లు : హైదరాబాద్ నగరంలోని బాగ్అంబర్‌పేట డివిజన్ కుర్మబస్తీ, పోచమ్మబస్తీల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ముందుగా రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. డివిజన్ కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి, వివిధ ప్రభుత్వ అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే కుర్మబస్తీ, పోచమ్మబస్తీలో పాదయాత్ర నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయా బస్తీలలో వాటర్‌వర్క్స్ అధికారులు రోడ్డును తవ్వి పైప్‌లైన్ పనులు చేపట్టారు. ఆ రోడ్లకు ప్యాచ్‌వర్క్ చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రాబోవు బోనాల పండుగకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు .

## పీర్‌ఆదిగూడ నిర్మాణాల కూల్చివేత అక్రమం

- అన్ని అనుమతులు తీసుకున్నాక కూల్చివేస్తారా
- మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దురాగతమే ఇది
- మండిపడ్డ బిఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 1లో ఉన్న భారీ నిర్మాణాలను సోమవారం ఉదయం అధికారులు కూల్చివేసిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మీ కాంగ్రెస్ నాయకులు అమ్మిన, మీ కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసిన ప్లాట్లలో నిర్మించుకుంటున్న ప్రజల ఇండ్లను మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఏమి ఆశించి ఈరోజు కూలగొట్టించాడో ఒకసారి విచారణ చేయించండి. ప్రజా పాలనలో ప్రజలకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులతో నిర్బంధిస్తారా..? మీకు అన్నగా ప్రచారం చేసుకుంటూ సుధీర్ రెడ్డి మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో చేస్తున్న అరాచకాలపై మీరు ఇంటెలిజెన్స్ నివేదిక తెప్పించుకోండి. లేదంటే ప్రజలు తిరగబడుతారు. మీ నిర్బంధాలు ప్రజాగ్రహాన్ని నిలువరించలేవు.అని కేటీఆర్ తేల్చిచెప్పారు. అమాయక ప్రజలకు ఈ ప్లాట్లు అమ్మింది కాంగ్రెస్ నాయకుడు రాందాస్ గౌడ్, మరో కాంగ్రెస్

2లో

## గండిమైసమ్మ చౌరస్తాలో వ్యక్తి ఆత్మహత్య

మేడ్చెల్,జూలై8 : మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తాలో ఖాళీ ప్రదేశంలో చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇండియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకున్నాడు. స్థానికుల

2లో

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్షసూచన

### తెలంగాణజిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



హైదరాబాద్,జూలై8తెలంగాణ ముచ్చట్లు : వర్షాకాలం వచ్చి నెల దాటినా తెలుగు రాష్ట్రాలు ఇప్పటి వరకు సరైన వర్షాలు లేవు. పైగా ఉక్కపోత కొనసాగుతోంది. అడపాదడపా వర్షాలు పడుతున్నా... భూగర్భజలాలు కూడా పైకి రాలేదు. దీంతో... ఇంకా వేసవికాలం కొనసాగుతూనే ఉందా..? అని అనిపిస్తోంది. హైదరాబాద్‌లో ఇంకా వాటర్ ట్యాంకర్లు తిరుగుతూనే ఉన్నాయి. సరైన వర్షాలు పడి ఉంటే... ఇప్పటికే భూగర్భజలాలు మెండుగా ఉండేవి. కానీ... ఈఏడు ఆ పరిస్థితిలేదు. దీంతో... వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో చల్లటి వాన కబురు చెప్తోంది భారత వాతావరణ శాఖ. తెలుగు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు వర్షాలు దంచికొడతాయని అంచనా వేస్తోంది. అంతేకాదు... తెలంగాణలో అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ కూడా జారీ చేసింది. ఈ వర్షాలతో అయినా ఉక్కపోత పోయి... వర్షాకాలం వచ్చిందే ఫీలింగ్ వస్తుందేమో

2లో

తెలంగాణ TELANGANA MUCHATLU
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : దార్లపాక రాజేష్



# సంపాదకీయం

## ఖరీదైన విద్యకు కళ్లెం వేయలేమా !

జాతీయ విద్యావిధానాం భ్రష్టుపట్టిందనడానికి ఇటీవలి నీట్ పరీక్షల గందరగోళమే నిదర్శనం. యధేచ్ఛగా పేపర్ల లీకేజీ వ్యవహారం విద్యార్థుల మనో స్థయిర్యం దెబ్బతీసింది. ఇలా చేస్తే విదేశాల్లో కూడా మన పరువు పోతుంది. తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వ హయాంలో పేపర్ల లీకేజీలఅఉ చాలానే జరిగాయి. వాటిని సమర్థించుకునే ప్రయత్నం మాత్రమే జరిగింది. నిజానికి ఇది దేశవ్యాప్త సమస్యగా మారింది. లీకేజీలను అరికట్టి అందుకు పాల్పడ్డ దగుల్బాజీలను కఠినంగా శిక్షించాలి. అలాగే ఇందుకోసం పార్లమెంటులో కఠిన చట్టాలు తీసుకుని రావాల్సి ఉంది. ఇకపోతే దేశంలో విద్య కరీదైనదిగా మారింది. విదేవీ విద్య కూడా ఖరదీయినదిగా మారింది. ఈ క్రమంలో విద్యారంగ సంస్కరణలు రావాలి. విదేశాలకు వెళ్లి చదువుకునే వారికి ఇతోధికంగా రుణాలు ఇవ్వాలి. పెరిగిన డాలర్ విలువ, రూపాయి పతనంతో వదేశీ మారకం కోసం విద్యార్థులు, టూరిస్టులు అధికంగా రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. బేటీపడావో బేటీ బచావో అంటున్న ప్రధాని మోడీ కనీసం ఆడపిల్లల చదువుల ఖర్చుల గురించి ఆలోచించడం లేదు. ఆడపిల్లలను చదివించడం కూడా భారంగా మారుతోంది. దేశీయంగా కూడా చదువులు భారంగా మారాయి. విదేశాలకు వెళుతున్న ఆడపిల్లలకు కనీసం వడ్డీ మాఫీ పథకం వర్తింప చేయాలన్న డిమాండ్ పట్టించు కోవడం లేదు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో వడ్డీలేని రుణాలను లేదా నామమాత్రం వడ్డీతో దేశీయంగా, విదేశాల్లో ..ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించేలా పథకాలు రూపొందాల్సి ఉంది. కార్పోరేట్ కంపెనీలకు వేలకోట్లు పందేరం చేస్తున్న ప్రభుత్వం విద్యారంగంలో మాత్రం వెసలుబాటు చూపడం లేదు. కొత్తగా ఏర్పడ్డ ఎన్‌డి కూటమినేతలు ఈ విషయంలో ఆలోచన చేయాలి. మోడీ నిర్ణయాలకు తలూపకుండా క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని, అందుకు పరిష్కార మార్గాలను కనుగొనాలి. ఇక్కడ ఉన్నత చదువులకు, విదేశాల్లో ఉన్నత చదువులకు ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. దీనిపై కేంద్రం ఎక్కడా చర్చించడం లేదు. బ్యాంకులు ఉదారంగా, తక్కువ వడ్డీ రుణాలు అందించడం లేదు. మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలు కావడంతో పాటు, ద్రవ్యోల్బణం పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. బంగారం ధరలు అందకుండా పోగుతున్నాయి. వైద్య సేవల ధరలు భరించలేనంత విపరీతంగా పెరిగాయి. అలాగే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు కూడా ఎప్పటికప్పుడు పెంచడంతో సామాన్యుల బతుకు భారంగా మారుతోంది. దీంతో సామాన్యులకు ఊరడింపు దక్కడం లేదు. దేశాన్ని 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారుస్తానని ప్రధాని మోడీ ప్రకటించారు.. కానీ దేశం ఇంకా మూడు ట్రిలియన్ డాలర్ల మార్కే దాటలేదు. పన్నుల భారం మోయలేక ప్రజల నడ్డి విరుగుతున్నది. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆర్థికరంగాన్ని నిలబెట్టేలా లేవు. ఎడాపెడా పన్నులు విధించడంలో ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు ఊపిరాడని స్థితికి చేరింది. ఇదంతా ఒక ఎత్తయితే విదేశీ విద్య చదువుకోవాలనే విద్యార్థులకు డాలర్ మారకం తీరని భారంగా మారింది. ఉన్నత చదువులకు వెళ్లాల నుకునే వారికి డాలర్ మారకం 83 రూపాయలకు పైనే కావడంతో తట్టుకోలేక పోతున్నారు. ఫీజులను డాలర్లలో చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఫీజలు భారం తడిసి మోపెడు అవుతోంది. ఏటా వేలాది మంది మనదేశం నుంచి అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు వెళుతుంటారు. వీరికి డాలర్ ఒక్కటే శరణ్యం. డాలర్ రేటు పెరగడం వల్ల ప్రతి ఒక్క విద్యార్థిపై అదనపు భారం పడుతోంది. చదువుకుని తమకాళ్లమీద తాము నిలబడాలన్న లక్షలాది మంది విద్యార్థులకు ప్రభుత్వాల విధానాలు గుదిబండగా మారాయి. ఉన్నత చదువులు భారంగా మారుతున్నాయి. విదేశాలకు వెళ్లాలనుకున్న వారికి సవాల్‌గా మారింది. డబ్బున్నవాళ్లే చదువుకునేలా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. పేదలు, మధ్య తరగతి వాళ్లు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా విదేశాలకు వెళ్లి చదువుకునే పరిస్థితితులు కానరావడం లేదు. ఇవన్నీ కూడా ఎన్‌డిఎ పక్షాలు చర్చించాలి. మోడీతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలి. ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్ పూర్తి చేసి లేదా ఇతర డిగ్రీలతో విదేశాలకు వెళ్లాలనుకున్న వారికి ప్రధానంగా రెండు సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకటి రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బ్యాంకులు సజావుగా స్పందించడం లేదు. నానా కొర్రీలు పెట్టడంతో యాతన పడాల్సి వస్తోంది. డబ్బున్న వారికి రుణాలు అందుతున్నాయి. కానీ పేదలు, మధ్య తరగతి వారికి రుణాలు ఇవ్వడం లేదు. ఇకపోతే రుణం పొందినా.. దాని వడ్డీ తడిసి మోపెడు అవుతోంది. విదేశాలకు వెళ్లి, చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగం సంపాదించి వచ్చే సరికి రుణభారం మోయలేనంతగా పెరుగుతోంది. దీంతో సంపాదన అంతా చదువుకోసం తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహా చెల్లించడానికే సరిపోతుంది. దీనికితోడు విదేశీయానం కూడా భారంగా మారింది. ఇంధన ధరల వల్ల విమానరంగం టిక్కెట్లను అమాంతం గా పెంచేసింది. దీంతో అమెరికా తదితర దేశాలకు వెళ్లాలనుకున్న వారికి టిక్కెట్లు భారంగా మారాయి. కరోనా తరవాత టిక్కెట్ల రేట్లు అందుబాటులోకి రాకుండా పోయాయి. విదేశీ విద్య కావచ్చు, దేశీయంగా చదువుకునే విద్య కావచ్చు..సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

## గొల్లకుర్మలకు కేబినేట్‌లో చోటు కల్పించాలి: బీర్ల ఐలయ్య

హైదరాబాద్,జూలై8 **తెలంగాణ ముచ్చట్లు :** తాను మంత్రి పదవిని ఆశిస్తున్నానని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. తాను సీఎంను అడిగానని ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. గొల్లకుర్మలకు మంత్రిపదవి ఇవ్వాలని సీఎం, డిప్యూటీ సీఎం, మిగతా మంత్రులను కూడా కలిశామని అన్నారు. నల్లగొండ పార్లమెంటు పరిధిలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మంత్రిపదవులున్నాయని, భువనగిరి సెగ్మెంట్ పరిధిలో ఒక్కరికీ లేదని అన్నారు. భువనగిరి సెగ్మెంట్ పరిధిలో తనకు అవకాశం కల్పించాలని కోరినట్టు చెప్పారు. ఎన్నడూ గొల్లకుర్మలు లేకుండా మంత్రి వర్గం లేదని ఐలయ్య గుర్తు చేశారు. గొల్ల కుర్మల ప్రతినిధిగా తనకు అవకాశం కల్పించాలని అన్నారు. ఏపీలో ముగ్గురికి మంత్రి వర్గంలో ఛాన్స్ ఇచ్చారని చెప్పారు. 50 లక్షల పై చిలుకు జనాభా వున్న గొల్లకుర్మలకు ప్రభుత్వంలో పదవులు ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎవరొచ్చినా చేర్చుకుంటామని చెప్పారు. తనకు సీఎం రేవంత్ రెడ్డిపై నమ్మకం ఉందని, మంత్రి పదవి వస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్షసూచన

చూడాలి. శ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరం మీదుగా ఉపరిత ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వచ్చే మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ లో వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు వాతావరణ శాఖ అధికారులు. ఏపీలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్తున్నారు. అలాగే... రాయలసీమతోపాటు మరికొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని కూడా తెలిపారు. విశాఖ, పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అనకాపల్లి, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఒక మోస్తరు వర్షం కరవొచ్చని అంచనా వేస్తున్నారు. వర్షం పడే సమయంలో... గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని.. వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణ, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని తెలిపింది వాతావరణ శాఖ. తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్టు ఐఎండీ ప్రకటించింది. హైదరాబాద్‌లో కూడ కుండపోత వర్షం కురుస్తుందని తెలిపింది. ఐదు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని... వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తెలంగాణలోని అన్ని జిల్లాలోకు రెండు రోజుల పాటు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఇక.. సాయంత్రం 4గంటల తర్వాత హైదరాబాద్‌లో భారీ వర్షం కురుస్తుందని అంచనా వేస్తున్నారు. వర్షం కురిసే సమయంలో గాలుల వేగం పెరగే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే... నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లో కూడా వర్షాలు కురుస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే పలు చోట్ల వర్షాలు పడుతున్నాయి. అయితే... పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరం మీదుగా కొనసాగుతున్న ఉపరిత ఆవర్తనం ప్రభావంతో... మూడు నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కొనసాగనున్నాయి. మరోవైపు.. కేరళ నుంచి గుజరాత్ తీరం వెంబడి ద్రోణి వస్తరించి ఉంది. దీని కారణంగా... అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు వేగంగా కదులుతున్నాయి. దీంతో... దక్షిణాది రాష్టాల్లో్ర వర్షాలు దంచికొడతాయని అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు... 11 రాష్ట్రాల్లో భారీ వర్ష సూచన ఉంది. ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. భారీ వర్షాలు, వరదలతో... ఉత్తరాఖండ్ జలవిలయంగా మారింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. కొండచరియలు విరిగి పడి... రహదారులు మూతపడ్డాయి. వర్షాల కారణంగా ఇప్పటికే చార్‌ధామ్ యాత్ర కూడా ఆపేశారు. ఉత్తరాఖండ్‌తోపాటు... యూపీ, బిహార్, అసోంలో కూడా వర్షాలు పడుతున్నాయి. వీటితోపాటు... ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోనూ వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది.

## వైఎస్ స్ఫూర్తితోనే ఆరు గ్యారెంటీల అమలు

గుర్తు చేసేది వైఎస్సార్ పాలన అని, వైఎస్ ముద్ర పేదల గుండెల్లో బలంగా ఉందని, ఆరు గ్యారంటీలకు వైఎస్ఆర్ స్ఫూర్తి అని అన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్ పాదయాత్రతో గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇటీవల రాహుల్ గాంధీ పాదయాత్రతో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ఉంది. రాహుల్‌ను ప్రధాని చేయాలని వైఎస్ఆర్ సంకల్పించారు. రాహుల్‌ను ప్రధానిని చేస్తేనే పేదలకు సంక్షేమం అందుతుంది. వైఎస్ఆర్ స్ఫూర్తితోనే రాహుల్‌ను ప్రధానిని చేసే విధంగా మనం ముందుకెళ్లాలని అన్నారు. వైఎస్ఆర్ ఆశయం అంటే సంక్షేమం, అభివృద్ధి. మూసీ ప్రక్షాళన చేయాలనే ఆలోచన వైఎస్ఆర్ స్ఫూర్తితోనే ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేసిన వారికి ఛైర్మన్ పదవులు ఇచ్చాం. ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది. రాహుల్ గాంధీ నాయకత్వానికి వ్యతిరేకంగా వెళ్లేవారు వైఎస్ వారసులు కాదు. పీసీసీ అధ్యక్షుడిగా మూడు సంవత్సరాలు ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నా అని రేవంత్ తెలిపారు.దేశానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తన లక్ష్యమని వైఎస్ అనేవారని, కాలం కాటువేసిందో, దురదృష్టం వెంటాడిందో గానీ రాహుల్ ప్రధాని కాకముందే వైఎస్ చనిపోయారని రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ పాదయాత్రకు స్ఫూర్తి వైఎస్ చేసిన పాదయాత్ర అని, రాహుల్ పాదయాత్ర కూడా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమని అన్నారు. రాహుల్ ప్రధాన ప్రతిపక్ష నేతగా రాణిస్తున్నారని, ప్రధాని పదవికి రాహుల్ ఒక్క అడుగు దూరంలోనే అన్నారని, రాహుల్ ప్రధాని కావడం నేటి చారిత్రక అవసరమన్నారు. కష్టపడి రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని, ఆయనను ప్రధాని చేయడానికి కృషి చేసేవారే వైఎస్ వారసులని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వానికి వ్యతిరేకంగా వెళ్ళేవారు వైఎస్ వారసులు కాదన్నారు. రాజశేఖర్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఈరోజు 35 మందికి కార్పొరేషన్ పదవులు ఇచ్చామన్నారు. ఒక్కరు కూడా పైరవీకారులు లేరని, ప్రతి ఒక్క కార్యకర్తను కాపాడుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా నడుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వైఎస్‌లాగా ప్రజల కోసం పని చేస్తామని తెలిపారు. వైఎస్ ప్రజల హృదయాల్లో ఉన్నారన్నారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదవాళ్ళు కలలో కూడా ఊహించని విధంగా సంక్షేమాన్ని పొందారని గుర్తుచేశారు. వైఎస్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్మెంట్, ఆరోగ్య శ్రీ పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. రాబోయే రెండు దశాబ్దాలు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోసం నాయకులందరం కలిసికట్టుగా ఉందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకంతో భారీ చేరికలు జరుగుతున్నాయన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసి తీరుతామని తేల్చి చెప్పారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తల ఎత్తుకొని తిరిగేలా చేస్తామన్నారు. కాంగ్రెస్ పాత నాయకులందరూ పార్టీలోకి రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## మందలించినందుకు టీచర్‌ను పొడిచి చంపిన విద్యార్థి

గౌహతి,జూలై8 : మార్కులు తక్కువ విద్యార్థిని ఉపాధ్యాయుడు మందలించడంతో అతడిని బాలుడు పొడిచి చంపిన సంఘటన అస్సాంలోని శివసాగర్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. 11వ తరగతి విద్యార్థి రసాయన శాస్త్రంలో తక్కువ మార్కులు రావడంతో రాజేశ్ బారువా విజయవాడ(55) అనే ఉపాధ్యాయుడు బాలుడిని మందలించాడు. తలిదండ్రులను తీసుకరమ్మని ఇంటికి పంపాడు.విద్యార్థి కత్తితో పాఠశాలకు హాజర య్యాడు. తరగతి గదిలో రాజేశ్ రాగానే అతడిపై విద్యార్థి కత్తితో దాడి చేశాడు. కత్తి తలలోకి దిగడంతో వెంటనేరాజేశ్‌ను తొటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించారు.

## గండిమైసమ్మ చౌరస్తాలో వ్యక్తి ఆత్మహత్య

సమాచారం మేరకు దుండిగల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి చెట్టుకు ఉరేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## పీర్‌ఆదిగూడ నిర్మాణాల కూల్చివేత అక్రమం

నాయకుడు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్ అమర్ సింగ్ కుటుంబం. ఈ ప్లాట్లను 2008లో నాటి సీఎం రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. గతంలో రెవెన్యూ అధికారులు ఇది పట్టా భూమిగా ఎన్‌వోసీ జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకొని చాలా మంది ప్రజలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఇంటి నిర్మాణం చేసుకుంటున్నారు. కానీ మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అధికారులను వేధించి అమాయక ప్రజలు లక్షలు పోసి నిర్మించుకున్న ఇండ్లను ఈ రోజు కూలగొట్టించాడు అని కేటీఆర్ మండిపడ్డారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సాయిప్రియ, సత్యనారాయణ పురం కాలనీ ఎలాట్ల యజమానుల సమస్యను శాశ్వతంగా తీర్చాలనే లక్ష్యంతో నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం 118 జీవో పరిధిలో చేర్చి ఎలాట్ ఓనర్స్‌కు మేలు చేయడం జరిగింది. కానీ ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసమర్థ ప్రభుత్వం అమాయక ఎలాట్ ఓనర్స్ ఇండ్లను కూల్చివేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై కక్షగట్టి చేస్తున్న వేధింపులకు ప్రజలు ముగింపు పలకడం ఖాయం. భవిష్యత్తులో మా బీఆర్ఎస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ఎలాట్ ఓనర్లను న్యాయం చేయడం జరుగుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. మా బీఆర్ఎస్ పార్టీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిని, కార్పొరేటర్లను మీరు వేధిస్తున్నారు. మేము ఇలా వేధించాలి అనుకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నామరూపాల్లేకుండా పోయేది. కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు మళ్ళీ వడ్డీతో సహా చెల్లిస్తాం. మా నాయకులను, మా మేయర్‌ను, మా కార్పొరేటర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ప్రియ ఎన్‌క్లేవ్‌లో ఇళ్ల కూల్చివేతపై ఎంపీ ఈటెల ఫైర్..

ఇవి అక్రమ భూములే అయితే జీహెచ్ఎంసీ అధికారులు గతంలో ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. దీని వెనక రాజకీయకుట్ర దాగి ఉందని ఈటెల ఆరోపించారు. ఇళ్లు నిర్మించుకున్న స్థలం ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన రామ్ దాస్ గౌడ్ నుంచే బాధితులంతా కొనుగోలు చేశారని, పోచయ్య అనే కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరకపోవడంతోనే వివాదానికి తెరతీశారని ఆరోపించారు. భయపెట్టి పార్టీలో చేర్చుకోవడం లేదంటే కేసులు పెట్టి జైళ్లకు పంపాలని చూసిన గత బీఆర్ఎస్ పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ వ్యవస్థలే వారిని హింసించే దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ ఇలాంటి పరిస్థితి ఉండేదని, ఇప్పుడూ అలానే కనిపిస్తోందన్నారు. రెండు ప్రభుత్వాలకూ పెద్దగా తేడా ఏం లేదని ఎంపీ ఈటెల అన్నారు. 30, 40సంవత్సరాల కిందట కొనుగోలు చేసిన భూముల విషయంలో ఇప్పుడు రాద్ధాంతం చేయడంపై సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో 300మంది రోడ్డున పడ్డారని రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు ఉన్నా సరే పేదల ఇళ్లు కూల్చిన ఎమ్మార్వో, ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులపై కేసులు పెట్టాలని ఎంపీ ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గంజాయి, సారా, మత్తుపదార్థాలు అరికట్టలేని కాంగ్రెస్ ప్రభుత్వం 200మంది పోలీసులతో ఇళ్లు కూల్చివేశారంటూ దుయ్యబట్టారు. కేసీఆర్‌ను ఓడించాలని మాత్రమే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని చురకలు అంటించారు. కేసీఆర్ లాగానే రేవంత్ రెడ్డికి కూడా కళ్లు నెత్తికి ఎక్కాయని ధ్వజమెత్తారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురి మంత్రులకు ఫోన్ చేసినా స్పందించ లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్యాయం జరిగిందనే ప్రజలు, ఉద్యమకారులు, మేధావులు కాంగ్రెస్‌ను గెలిపిస్తే వీరు అంతకు మించి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ దుర్మార్గాలను బీజేపీ నేతలు చూస్తూ ఉరుకోరని, ఇలాంటి చర్యలు పునరావృతం అయితే తగిన గుణపాఠం చెప్తామని ఎంపీ ఈటెల రాజేందర్ హెచ్చరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# మిన్నంటినమండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు

## రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా పోదెం.వీరయ్య నియామకం పట్ల హర్షం

**తెలంగాణ ముచ్చట్లు (నూగురు):** వెంకటాపురం ములుగు జిల్లా భద్రాచలం మాజీ శాసనసభ్యులు, ఏఐసిసి కార్యవర్గ సభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పొదెం. వీరయ్యను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా ప్రకటించడంతో మండలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఆనందోత్సవాల నడుమ మండల కేంద్రం లోని అంబేద్కర్ సెంటర్లో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తున్న పొదెం వీరయ్యని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీకి పొదెం వీరయ్య సేవలను ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేసేలా కార్యచరణ తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిడెం శివ, జిల్లా ఉపాధ్యక్షులు మన్యం సునీల్ బాబు, ఎంపీటీసీ గారపాటి రవి, ఎడ్ల క్రాంతి, తదితరులుపాల్గొన్నారు.

# చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వాజేడు లో రక్తదాన శిబిరం

## అటవీశాఖ రేంజ్ఆఫీసర్ చంద్రమౌళి సహకారంతో బోగత జలపాతం దగ్గర రక్తదానం




**తెలంగాణ ముచ్చట్లు వాజేడు ములుగు జిల్లా:** వాజేడు రేంజ్ ఆఫీసర్ చంద్రమౌళి సహకారం తో బొగత సెక్షన్ ఆఫీసర్ గొంది నారాయణ బొగత బీట్ ఆఫీసర్ కవిత ఆధ్వర్యంలో 20 యూనిట్ల రక్తం నాగారం ప్రభుత్వ ఆసుపత్రి వారికి చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వారుఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ తో పాటు చీకుపల్లి యువత గుమ్మడిదొడ్డి యువత రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు బొగత సిబ్బంది కూడా రక్తదానం చేశారు గుమ్మడిదొడ్డి యూత్ లీడర్ బోదే బోయిన భరత్ చీకుపల్లి యూత్ లీడర్ బోధ బోయిన వికాస్ , నగరం ప్రభుత్వ సిబ్బంది మల్లికా, మురళి , స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు చీడెంసాయిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల ఇళ్లకు వెళ్లి నివాళులర్పించిన ఎంపీ రఘురాం రెడ్డి

## - ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి, మూడు శివ కుటుంబాలకు పరామర్శ



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** అనారోగ్య కారణాలతో ఈశ్వర మాదారంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి తండ్రి రంగారెడ్డి మృతదేహాన్ని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి సోమవారం సందర్శించి నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులు సూర్యనారాయణ రెడ్డి, ఇతరులను ఈ సందర్భంగా ఓదార్చారు. ఇదే మండలంలో బురాన్ గుట్ట తండాలో మూడు శివ సతీమణి అంకిత మృతి చెందగా ఆమె మృతదేహాన్ని ఎంపీ సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైయస్సార్ సేవలు చిరస్మరణీయం

## - ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు కాంగ్రెస్ పార్టీలో చిరస్మరణీయంగా ఉంటాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి 75వ జయంతి సోమవారం సందర్భంగా హైదరాబాద్ మాదాపూర్ లో గల అయ్యప్ప సొసైటీలోని రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వనపర్తి ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దివంగత మాజీ ముఖ్యమంత్రి %ూ=% కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు ఎనలేనివని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం, నిరుపేదల అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి కేంద్రంలోనూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపునుసంపాదించుకున్న గొప్ప వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు అని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సురేష్ నాయక్ ప్రేమ్ యాదవ్ డి నాగేష్ వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, సాయి చరణ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి లో వైఎస్ఆర్ జయంతి వేడుకలు




**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా పెద్దమందడి మండల కేంద్రంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దమందడి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెంటన్న ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు జయంతి వేడుకలను నిర్వహించి వైయస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి మహనీయుడికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు సేవ చేసిన ఘనత వైయస్సార్ కు దక్కుతుంది అని అన్నారు. రాజకీయరంగంలో నేనున్నాను అంటూ సామాన్య కార్యకర్తలతో ప్రజలతో వారికి అన్ని విధాలు అండగా తోడుగా ఉంటూ అంచలంచెలుగా ఎదిగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే ప్రజా ముఖ్యమంత్రిగా ప్రజాసేవ చేశారని పేర్కొన్నారు. పేదవాడికి రోగం వస్తే ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకొని మంచి కార్పొరేట్ హాస్పిటల్లో ఉచితంగా వైద్యం చేపించుకునే అవకాశం వైయస్ రాజశేఖర్ రెడ్డి కల్పించారని గుర్తు చేశారు. రైతులకు ఏకకాలంలో రుణాలను మాఫీ చేసి, జల యజ్ఞం పేరుతో రైతులకు పొలాలకు నీళ్లు అందించడం జరిగింది. అభయాసం పేరుతో పేద ప్రజలకు మహిళలకు వికలాంగులకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే 50 లక్షల మందికి పింఛనిచ్చిన ఘనత ఆనాటి మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఘనత అని అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ప్రజా దర్బార్ పెట్టి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్న నిజమైన ప్రజా సేవకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని, పేద విద్యార్థులకు కళాశాలలో ఫీజు రియంబర్స్మెంట్ సహాయంతో డాక్టర్లుగా, ఇంజనీర్లు,గా లాయర్లుగా ఆయన ప్రవేశపెట్టిన పథకాలతో తీర్చిదిద్దడం జరిగిందని ఆయన చేసిన సేవలను కొనియాడారు.

కార్యక్రమంలో పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి . పెంటన్న యాదవ్. ఉపాధ్యక్షులు వాకిటి శ్రీనివాసులు. సింగల్ విండో మాజీ అధ్యక్షుడు ఐ .సత్య రెడ్డి. ప్రస్తుత సింగల్ విండో అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి. జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గట్టు మన్యం. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు. శ్రీనివాసులు. మండల్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ వహీద్. మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు. సింగల్ విండో డైరెక్టర్ వాకిటినరేష్ కుమార్. పల్లె సత్యనారాయణ. సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి. కొండ రవీందర్ రెడ్డి. మణిగిల్ల సురేష్. అల్వాల లక్ష్మి కాంత్ రెడ్డి. విక్రమ్ రెడ్డి. లక్ష్మీనారాయణ. రఘువర్ధన్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగిందిలి.

# ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డును సన్మానించిన పోలీస్ కమిషనర్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు షేక్. మాస్తాన్ హెచ్ జి 595 ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ..సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. రిటైర్ మెంట్ తన వృత్తికే, కాని తన వ్యక్తిత్వానికి కాదని, మీ విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, హోంగార్డ్ ఆర్ ఐ సురేష్, హోంగార్డ్ ఆఫీసర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మహ్మద్ రఫీ, నాగరాజు, రవి హోంగార్డ్ ఆఫీసర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు



# మహిళా సంఘంలో వివోఏ గా కొనసాగించాలి

## ప్రజావాణిలో జిల్లా జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బాధితుడు జి గోవర్ధన్ రెడ్డి

**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి జిల్లా పానుగల్ మండలం బహుదూర్గూడెం గ్రామంలో మహిళా సంఘం లో వివోఏ గా విధులు నిర్వహిస్తున్న గోవర్ధన్ రెడ్డిని ఏపిమ్ సక్రు నాయక్, సీసీ నాగరాజులు లంచం డిమాండ్ చేసి,సేరుప్ లాగిన్ లో గోవర్ధన్ పేరు తొలగించారు. ఇట్టి విషయంపై గోవర్ధన్ రెడ్డి సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేసి జరిగిన అన్యాయాన్ని వివరించడం జరిగింది వారిపై పై పూర్తిగా విచారించి కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని గోవర్ధన్ కలెక్టర్ ను కోరారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను పరామర్శించిన

## రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** పెద్దమందడి మండలం మోజర్ల గ్రామానికి చెందిన ఈడిగి తిరుపతమ్మ ఆదివారం రోడ్డు ప్రమాదానికి గురికావడం జరిగింది. ఇట్టి విషయాన్ని గ్రామ కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి గారికి తెలియజేయడం జరిగింది. చిన్నా రెడ్డి వెంటనే వనపర్తి ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఈడిగి తిరుపతమ్మను పరామర్శించడం జరిగింది. అక్కడ ఉన్న డాక్టర్లను ఆమె ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకోవడం జరిగింది. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించడం జరిగింది. తిరుపతమ్మ మీరు గాయాల నుంచి త్వరగా కోలుకుంటారని. మనో ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పడం జరిగింది పరామర్శించినవాళ్లు మోజర్ల గ్రామ మాజీ సర్పంచులు ఎం. నాగరాజు. గట్టు మన్యం. పెద్దమందడి మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు దయాకర్. మండల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు. సీనియర్ నాయకులు ఆదెంరాములు యాదవ్. ఆడెం మల్లేష్ యాదవ్. ఎం. కురుమూర్తి యాదవ్.

# ట్రామా సెంటర్ ఏర్పాటు ఎందరికో ప్రాణదానం

## సెంటర్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి

**నల్లగొండ,జూలై8 :** రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడం ఎంతో గొప్ప విషయమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం అయన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపాడు టోల్ ప్లాజా వద్ద ఏడీపీ సంస్థ ద్వారా సుమారు 5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ట్రామా కేర్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందించేందుకు ఏడీపీ సంస్థ ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అలాంటి సమయంలో వారికి తక్షణ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం హాస్పిటక్‌కు పంపించేందుకు ముందుగా ట్రామా కేర్ సెంటర్‌లో చికిత్స అందించేలా ఎకరం స్థలంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావడం పట్ల ఏడీపీ సంస్థను అభినందించారు. దీనిని త్వరితగతిన పూర్తి చేసి సెప్టెంబర్ 7న ట్రామా కేర్ సెంటర్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఏడీపీ సంస్థను కోరారు. ప్రభుత్వం తరఫున అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

# అద్దె భవన్ లో కొనసాగుతున్న పెద్దమందడి సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం

- వసతి గృహం సమీపంలో బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలి
- వసతి గృహం గేటు వరకు ఇరువైపులా వీధిలైట్లు ఏర్పాటు చేయాలి
- మందుబాబులకు అడ్డాగా మారిన వసతిగృహం ఆవరణం
- ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- ప్రజావాణిలో ఫిర్యాదు
- వనపర్తి జిల్లా ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు వీరపాగ రామకృష్ణ మహారాజ్



**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి లోని నాగవరం సమీపంలో గల అనూస్ అకాడమీ అద్దె భవన్ లో కొనసాగుతున్న పెద్దమందడి తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల వసతి గృహం సమస్యలపై జిల్లా ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షులు వీరపాగ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. నాగవరం సమీపంలో ప్రధాన రహదారి దగ్గర బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని, వసతిగృహం గేటు వరకు రోడ్డుకు ఇరువైపులా వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ప్రజావాణిలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు**

అలాగే వసతిగృహం ఆవరణ ప్రదేశంలో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ ఆవరణం మందుబాబులకు వడ్డాగా మారిందని, మందుబాబులు మద్యం సేవించి ఇస్తానుసారంగా మందు సీసాలు పగలగొడుతున్నారని అధ్యాపక బృందం భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారని వసతి గృహం దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని రోజువారి పెట్రోలింగ్ చేస్తూ డ్యూటీ అధికారుల సంతకాలకు రిజిస్టర్ పెట్టాలని జిల్లా ఎస్పీకి ధర్మ సమాజ్ జిల్లా నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిడెం శివ, జిల్లా ఉపాధ్యక్షులు మన్యం సునీల్ బాబు, ఎంపీటీసీ గారపాటి రవి, ఎడ్ల క్రాంతి, తదితరులుపాల్గొన్నారు.

# నేటికీ ప్రజల గుండెల్లో వైఎస్సార్ పదిలం

- ఆయన సేవలు మరువలేనివి: ఖమ్మం ఎంపీ
- మంత్రి పొంగులేటి ఖమ్మం , కూసుమంచి క్యాంపు కార్యాలయాల్లో, కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో మహానేతకు రఘురాం రెడ్డి ఘన నివాళి





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :**తన సంక్షేమ పథకాలతో అట్టడుగు నుంచి అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చిన ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర రెడ్డి నేటికీ ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నారని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. మహానేత 75వ జయంతిని పురస్కరించుకుని సోమవారం తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి ఖమ్మం, కూసుమంచి క్యాంప్ కార్యాలయాల్లో, కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి.. జోహార్ వైఎస్సార్ అంటూ ఘన నివాళులు అర్పించారు.

**క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి కేక్ కటింగ్..**

మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తో కలిసి ఎంపీ రఘురాంరెడ్డి కాంగ్రెస్ నాయకులు, శ్రేణుల నడుమ కేక్ కట్ చేశారు. అనంతరం ఆయా కార్యక్రమాల్లో.. కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి ఎంపీ మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్సార్ రెండు దఫాల ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పుడు కేవలం ఆరున్నర ఏళ్ళ లోనే ఉమ్మడి రాష్ట్రానికి ఎంతో చేశారని గుర్తుచేసుకున్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్మెంట్, 108 వంటి ప్రతిష్టాత్మక పథకాలతో పేదల కలను సాకారం చేశారని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులతో రైతన్నలకు అండగా నిలిచారని చెప్పారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. ఆ దివంగత మహానేత వైయస్సార్ పేరు నిలిపేలా, ఆయన స్ఫూర్తి నింపేలా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి, ఇతర మంత్రివర్గం నేతృత్వంలో ప్రజా సంక్షేమ పాలన మన రాష్ట్రంలో సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో..: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎంపీపీలు శ్రీనివాస్, మంగీలాల్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రామ సహాయం మాధవి రెడ్డి, కాంగ్రెస్ కూసుమంచి మండల అధ్యక్షులు మట్ట గురవయ్య, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, హఫీజుద్దీన్, బజ్జూరి వెంకటరెడ్డి, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొప్పుల చంద్ర శేఖర్ రావు, కొత్తా సీతారాములు, లింగాల రవికుమార్, మలీదు వెంకటేశ్వర్లు, పద్మజా రెడ్డి, శ్రీ కళా రెడ్డి, ఏనుగు వెంకటరెడ్డి, భీష్మ చారి, లింగారెడ్డి, అజ్మీర అశోక్ నాయక్, రమాదేవి, బాణాల లక్ష్మణ్, తిరుపతమ్మ, మాదాసు ఉపేందర్, పెంద్ర అంజయ్య, వెంపటి రవి, రామిరెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డి, మొగిలిచర్ల సైదులు, తుపాకుల వెంకన్న, నరసింహారావు, తోట ప్రసాద్, చింతమల్ల గురుమూర్తి, మెండె వెంకటేష్ యాదవ్, యువనేత గోపి, కాంపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలి

-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు







**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం మంత్రి కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో సమావేశమయ్యారు. జిల్లాలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్నిముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నగరాల్లో త్రాగునీటి కొరత తలెత్తకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ పకడ్బందీగా చేయాలన్నారు. యువతకు మత్తు పదార్థాలు అందించే ముఠాలను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు. కలెక్టరేట్ కు వచ్చిన మంత్రికి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన మంత్రి, వాటిని కలెక్టర్ కు అందజేస్తూ, త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.

# నాబార్డ్ తరపున ఎన్ని నిధులైన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం

-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** వేంసూరు సహకార సంఘాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుటకు రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డ్ తరపున ఎన్ని నిధులైన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మంత్రి వేంసూరులో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చే ఏర్పాటుచేయబడిన నూతన పెట్రోల్ బంక్ ను స్థానిక సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతులకు డ్రోన్, మేకనైజేషన్, డ్రిప్, ఫర్టిలైజర్ తదితరాలు సహకార సంఘాల ద్వారా అందించుటకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. సహకార స్ఫూర్తితో సహకార సంఘాలు వచ్చాయని, సహకార సంఘంలో ఎంతమంది సభ్యులుంటే అంతమందికి ఋణాలివ్వాలన్నారు. పావలావడ్డి, వడ్డీ లేని రుణాలు అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 2 లక్షల ఋణమాఫీ క్రింద ఆగస్టు 15 లోగా రైతులకు రూ. 31 వేల కోట్లు అందిస్తామన్నారు. రైతు భరోసా అమలుకు రైతుల నుండి అభిప్రాయాలు స్వీకరిస్తున్నట్లు, సాక్గు భూమి, కష్టపడ్డ రైతులకు రైతు భరోసా అందాలన్నారు. రైతులతో కూలంకషంగా చర్చించిన మీదట, వారి అభిప్రాయాలను బట్టి ఉపసంఘం తగు నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి అన్నారు. రైతులందరికీ భూమికి ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోనున్నట్లు, శాఖాపరంగా కంపెనీల నుండి టెండర్లు పిలిచి రైతులందరికీ మేలు కలిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతు భీమా కు ప్రభుత్వం రూ. 2 వేల కోట్ల ప్రీమియం చెల్లించాలని, దీనికై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తమ్మిలేరు, కృష్ణ జలాలు రాకపోయినా గోదావరి జలాలు తెచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆగస్టు 15 వరకు లంకాసాగర్ కు గోదావరి జలాలు రప్పిస్తామన్నారు. గోదావరి జలాలతో ప్రాంతం సస్యశ్యామలం చేయడం తన కోరిక అని మంత్రి తెలిపారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ఆయన అన్నారు. పామాయిల్ సాగును ప్రోత్సహించాలని, ఈ సంవత్సరం ఆఖరికి వేంసూరులో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామని ఆయన అన్నారు. కేంద్రంతో పామాయిల్ కు గిట్టుబాటు ధర స్థిరీకరణ కు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ రహదారికి 2 ఎంట్రీ, 2 ఎక్జిట్, సర్వీసు రోడ్ మంజూరు సాధించిన మంత్రిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఎంట్రీ, ఎక్జిట్ పాయింట్లను మంత్రి ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, డిసిఓ ఖుర్షీద్, డిసిసిబి సిఇఓ రెహ్మాన్, గ్రీన్ ఫీల్డ్ సీనియర్ ఇంజనీర్ రఘునందన్, వేంసూరు ఎంపిపి పగుట్ల వెంకటేశ్వర రావు, వేంసూరు పిఏసీఎస్ అధ్యక్షులు తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి

## -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :**ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తో కలిసి పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తెలిపారు. ధరణి భూ సమస్యలకు సంబంధించి ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ స్వీకరిస్తూ సదరు దరఖాస్తు ప్రస్తుత స్థితిగతులను ఆన్ లైన్ లో పరిశీలించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ప్రజావాణిలో ఖమ్మం అర్బన్ మండలం ధ%శీ%సలాపురం గ్రామం నుండి పాశం బ్రహ్మారెడ్డి, తనకు గల సర్వే నెం. 80/ఇ/1 లో 0.20 కుంటలు భూమి నాలా కన్వర్షన్ చేయబడినట్లు, ఇట్టి భూమి పట్టాదార్ పాస్ పుస్తకం నుండి తొలగించబడలేదనే కారణంచే రైతు బంధు స్కీం నిలుపుదల చేశారని, పరిశీలించి తనకు రైతుబంధు పునరుద్ధరణ చేయాలని కోరగా, తహశీల్దార్ ను తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం ఖానాపూరం నుండి భట్టు నాగమణి, తను ప్రయివేటు ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్ గా పనిచేస్తున్నట్లు, తనకు ఖానాపురం హావేలి టేకులపల్లి లో డబల్ బెడ్ రూమ్ 35వ బ్లాక్ ఎస్-5 నందు కేటాయించారన్నారు. తన భర్త తనకు తెలియకుండా అట్టి ఇంటిని అమ్మారని, కొన్నవారు తనపై దౌర్జన్యం చేస్తున్నారని, తన ఇల్లు తనకు ఇప్పించగలందులకు కోరగా, తహశీల్దార్ ను విచారించి, తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. బోనకల్ మండలం రావినూతల నుండి బి. మంగమ్మ, తాను సర్వే నెం. 152/32 లో 0.25 భూమి కొనుగోలు చేసినట్లు, అట్టి భూమికి పాస్ బుక్ మంజూరుకు కోరగా, బోనకల్ మండల తహశీల్దార్ కు తగుచర్యకై ఆదేశించారు. తల్లాడ మండలం పినపాక గ్రామం నుండి ఎస్కె. మైబుబీ, శాదీముబారక్ పథక లబ్ధి కొరకు దరఖాస్తు చేసినట్లు, మంజూరుకు కోరగా, ఖమ్మం ఆర్డీవో ను తగుచర్యకై ఆదేశించారు. ముదిగొండ మండలం గంధసిరి గ్రామం నుండి జాలాది విద్యాసాగర్, తన భార్యకు అంగన్వాడీ టీచర్ గా నియామకం కొరకు అభ్యర్థించగా, జిల్లా సంక్షేమ అధికారిని పరిశీలనకై కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామం నుండి మాలోత్ బిగిని, తన ఇంటిలో అగ్నిప్రమాదం జరిగి కాలిపోయినట్లు, అందులో పట్టాదారు పుస్తకాలు, విలువైన కాగితాలు కాలిపోయాయని, తిరిగి పట్టాదారు పుస్తకాలు ఇప్పించగలందులకు కోరగా, తహశీల్దార్ ను తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. నేలకొండపల్లి మండలం రాయిగూడెం నుండి మాతంగి అజయ్ కుమార్ రేషన్ డీలర్ షిప్ ఇప్పించగలందులకు కోరగా, ఆర్డీవో ను పరిశీలనకై ఆదేశించారు. తల్లాడ మండలం అన్నారుగూడెం నుండి సుంకర భద్రమ్మ, తమ గ్రామంలో సైడ్ కాల్వలు లేక విష జ్వరాలు వస్తున్నట్లు, సైడ్ కాల్వల నిర్మాణానికి కోరగా, జిల్లా పంచాయతీ అధికారిని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం, విశ్రాంత ఉద్యోగులకు వృద్ధాశ్రమం కొరకు స్థలం కేటాయింపుకు కోరగా, ఆర్డీవో ను కలెక్టర్ తగుచర్యకై ఆదేశించారు. కామేపల్లి నుండి కీసగాని శంకర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అక్రమ కారుణ్య నియామకాలపై చర్యలకు కోరగా, కలెక్టర్ నివేదిక సమర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి ని ఆదేశించారు. గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కమిటీ, 2020-21, 2021-22 సంవత్సర ట్రైకార్ లబ్ధిదారులకు నిధుల విడుదలకు కోరగా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి ని తగుచర్యకై ఆదేశించారు. చింతకాని మండలం, ప్రొద్దుటూరు గ్రామం నుండి షేక్ జాన్ సాహెబ్ తనకు 75 శాతం అంగవైకల్యం ఉన్నట్లు, ఆసరా పెన్షన్ మంజూరుకు కోరగా, కొనిజర్ల మండలం పెద్దగోపతి గ్రామం నుండి మాచర్ల సైదమ్మ, తన భర్త 4 సంవత్సరాల క్రితం మరణించినట్లు, వితంతు పెన్షన్ మంజూరుకు కోరగా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్డీవో సన్యాసయ్య, జెడ్పి సిఇఓ ఎస్. వినోద్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞలో రెడ్ అండ్ ఎల్లో డే



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :**స్థానిక వీడియోస్ కాలనీలో నీ సర్వజ్ఞ పాఠశాలలో రెడ్ అండ్ ఎల్లో డేను ఎంతో ఘనంగా నిర్వహించారు. సర్వజ్ఞ విద్యార్థులు రెడ్ అండ్ ఎల్లో దుస్తులు ధరించి ఎరుపు మరియు పసుపు రంగులతో గాలి బుద్రలను ప్రాంగణమంతా తీర్చిదిద్ది ఎరుపు మరియు పసుపు యొక్క ప్రత్యేకతను చాటుకున్నారు. ఒకరికి ఒకరు మిఠాయిలు పంచుకున్నారు ప్రతి చిన్నారి ఎరుపు మరియు పసుపు వస్త్రములు ధరించి పాఠశాల ప్రాంగణం అంతా సందడి చేశారు. ఎరుపు మరియు పసుపు రంగులతో ప్రతి చిన్నారి పాఠశాల ప్రాంగణమంతా వికసించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్వి నాగేంద్ర కుమార్ మరియు నీలిమ మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎరుపు మరియు పసుపు దుస్తులు ధరించి ఎంతో వైవిధ్యంగా ఎరుపు మరియు పసుపు డేను నిర్వహించడం సంతోషమని తెలిపారు. ఎర్రని పండ్లతో కూరగాయలతో తినడం వలన ఆరోగ్యంగా ఉంటామని ఈ సందర్భంగా విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఆర్వీ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇటువంటివి భిన్నమైన మరియు చిన్నారులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడంలో మా పాఠశాల ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. విద్యార్థులను చైతన్యవంతులను కార్యోన్ముఖులను చేయుటకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఎర్రని మరియు పసుపు కూరగాయలు వస్తువులతో ప్రాంగణమంతా కనులవిందుగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆర్వి నాగేంద్ర కుమార్ నీలిమ ప్రిన్సిపల్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన విద్యని అందించాలి

## -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రణాళిక బద్ధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఏన్కూరు మండలం హిమాం నగర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల విద్యా ప్రమాణాలు పరీక్షించారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు వచ్చాయా, పాఠ్యాంశాలు జరుగుతున్నాయా, మధ్యాహ్న భోజనం వివరాలు కలెక్టర్ అడిగి







తెలుసుకున్నారు. ప్రాథమిక తరగతుల విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలను కలెక్టర్ పరీక్షించారు. విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని, పిల్లలకు తప్పనిసరిగా చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్ రావాలని అన్నారు. పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. విద్యుత్, త్రాగునీరు, టాయిలెట్ పనులు పూర్తయినట్లు, మైనర్ పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. మిగులు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రం ద్వారా గ్రామంలో గర్భిణులను 100 శాతం ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ చేసి, రెగ్యులర్ పరీక్షలు చేయించుకునేలా చూడాలని అన్నారు. గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రానికి విద్యుత్ సరఫరా, లైట్లు, ఫ్యాన్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పాఠశాల లోపల, ఆవరణ అంతయు పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు వహించాలని అన్నారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలతో పాటు నేలపై కూర్చొని, వారి విద్యా ప్రమాణాలు పరిశీలించారు. పిల్లలతో మమేకమై, వారిని ఉత్సాహపరిచారు.

# పేద ప్రజల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి

## -సూరంశెట్టి కిషోర్ - తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** నిరుపేదల ఆరోగ్యానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసా కల్పిస్తుందని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురంశెట్టి కిషోర్ అన్నారు. ఆదివారం మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర పట్టణం, మండలంలో మంజూరైన 5,40,000 రూ.ల విలువగల 13 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మధిర మండలం, పట్టణంలో లబ్దిదారులకు చెక్కుల పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం విషయంలో పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు తెలంగాణ ప్రభుత్వం సీఎం సహాయనిధి కింద చికిత్సకు తగిన ఆర్థిక సాయం బాధితులకు అందిస్తోందని అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగా హనుమంతరావు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దార బాలరాజు మున్సిపల్ కౌన్సిలర్లు కోన ధని కుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, మువ్వ వెంకయ్య బాబు, బాలు నాయక్, పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆదిమూలం శ్రీనివాసరావు, మైలవరపు చక్రి, పల్లపోతు ప్రసాదరావు, సిద్ధంశెట్టి సందీప్, జింకల కోటేశ్వరరావు పుల్లూరిబాబు, దూదేకుల జానీ, షేక్ షన్ను, గుండె మెడ బాలాజీ, తుమ్మల శ్రీనివాసరావు మరియు పట్టణ మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు మరో షాక్

## - కారు దిగిన ఎమ్మెల్సీ చల్లా
## - సిఎం రేవంత్‌రెడ్డితో భేటీ

**హైదరాబాద్,జూలై8తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. అలాగే ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా ఒకేసారి 'కారు' దిగేశారు. దీంతో పార్టీ నుంచి వెళ్లిపోయేవారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూనే ఉంది. అటు కాంగ్రెస్‌లో చేరికలు పెద్ద ఎత్తున కొనసాగుతూనే ఉన్నాయి. ఇదిలా ఉండగా తాజాగా మరో ఎమ్మెల్సీ బీఆర్ఎస్‌ను వీడటానికి సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్సీ చల్లా భేటీ అయ్యారు.

# రైతుల సహకారంతో ఎర్త్ వర్క్స్ పూర్తయ్యింది

## -రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు







ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : సీతారామ, ఎన్ఎస్పి ప్రాజెక్టుల లింక్ కెనాల్ పనుల పురోగతిని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ఏన్కూరు మండలం హిమాంనగర్ వద్ద క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సహకారంతో ఎర్త్ వర్క్స్ పూర్తయినట్లు, స్ట్రక్చర్ ల పనులు పురోగతిలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. సుమారు 70 కోట్ల ఖర్చుతో లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టని ఆయన తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులు బాధ పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. భూములకు నష్ట పరిహారం అందజేయడం త్వరితగతిన చేయాలన్నారు. భూసేకరణ క్రింద కోల్పోయిన భూమి కాకుండా, దాని ప్రభావంతో వ్యవసాయానికి ఉపయోగం లేని భూములు ఉంటే, అట్టి రైతులకు న్యాయం చేయాలన్నారు. భూ సేకరణ సమస్యలుంటే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తేవాలన్నారు. పనులు ఆగకూడదని, లేబర్, మెషినరీ పెంచి అనుకున్న సమయానికి పూర్తి అయ్యేలా అన్ని చర్యలు చేపట్టాలని అన్నారు. యుద్ధప్రాతిపదికన పనులు కొనసాగించి, నెలాఖరుకు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా నీటిపారుదల సిఇ శ్రీనివాస రెడ్డి, ఎస్ఇ శ్రీనివాస రెడ్డి, ఇఇ అర్జున్, డిఇ చంద్రశేఖర్, జెఇ సాగర్, ఏన్కూరు మండల తహశీల్దార్ శేషగిరిరావు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట

## - స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సాహకాలు
## - పలు స్వయం సమృద్ధి వ్యాపారాలకు తోడ్పాటు

హైదరాబాద్,జూలై8 తెలంగాణ ముచ్చట్లు : మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలు, కీలక ప్రాంతాల్లో మహిళా సంఘాలతో తెలంగాణ వంటకాల అమ్మకం దుకాణాలు ప్రారంభించిన ప్రభుత్వం...గ్రామీణ మహిళల ఆదాయ వనరలు పెంచే దశగా చర్యలు చేపట్టింది. వారితో నాటుకోళ్ల పెంపకం, పౌల్ట్రీ ఫారాలు, పాడి ఉత్పత్తులు విక్రయ కేంద్రాలు, సంచార చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయించనుంది. బ్యాంకుల ద్వారా వారికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే డ్వాక్రా సంఘాలకు రుణాలు అందించడం, వడ్డీ రాయితీలతో వారి కాళ్లపై వారు నిలుదొక్కుకునేలా చేయూత అందించిన ప్రభుత్వం...వారిని వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు మరో కీలక ముందడుగు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళాల ఆదాయం పెంచే మార్గాలను అన్వేషిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోళ్ల పెంపకం, పౌల్ట్రీఫారాలు ఏర్పాటుతోపాటు పాడి ఉత్పత్తులు, చేపల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించింది. ఈ మేరకు బ్యాంకులతో చర్చించి మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించనుంది. ఆసక్తి, అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి జిల్లాకు 500 మంది డ్వాక్రా సభ్యులకు పాడి పశువులు అందజేయనున్నారు. దీనికి నాలుగున్నర కోట్లు ఖర్చు కానుంది. ఒక్కొక్క సభ్యురాలికి ఒకటి లేదా రెండు పాడి గేదెలను అందజేయనున్నారు. దీనికోసం లక్ష రూపాయలు రుణం ఇవ్వనున్నారు. పశువులు మేపుకునేందుకు అనువైన ప్రాంతం ఉన్న వారికే వీటిని మంజూరు చేయనున్నారు. నాటుకోళ్ల పెంపకం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడానికి ప్రభుత్వం సాయం అందించనుంది. ఒక్కో జిల్లాకు 3 కోట్లతో రెండు వేల డ్వాక్రా గ్రూప్ సభ్యురాళ్లకు నాటుకోళ్లను అందించనున్నారు. దీనికోసం ఒక్కొక్కరికీ 15వేల రూపాయల రుణం అందజేస్తారు. వీటి ద్వారా దాదాపు 100 వరకు నాటు కోళ్ల పిల్లలను తెచ్చి పెంచుకునే అవకాశం ఉంది. వీటితోపాటు కోళ్ల ఫారాలు పెట్టుకునేందుకూ ఆర్థికసాయం చేయనున్నారు. ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఒక్కో యూనిట్కు రెండు లక్షల 91వేల రూపాయలు రుణం అందించ నున్నారు. సొంతంగా స్థలం ఉండి షెడ్డు వేసుకుని ఫారం ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చే డ్వాక్రా గ్రూప్ సభ్యురాళ్లకు వీటిని మంజూరు చేయనున్నారు. కోళ్ల ఫారం నిర్వహణపైనా వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే చేపల విక్రయ కేంద్రాల ఏర్పాటుకు సైతం ప్రభుత్వం రుణం మంజూరు చేయనుంది. పాల విక్రయ కేంద్రాలను సైతం మండలానికి ఒకటి చొప్పున మహిళా సంఘాలకు అందజేయనున్నారు. బస్టాండ్లు(ఃబీబ ఃూబిజీనిట), రైల్వేస్టేషన్లు, సినిమా థియేటర్లు, రైతు బజార్లు ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక్కో యూనిట్కు లక్షా 90వేల రూపాయల రుణం ఇవ్వనున్నారు. డ్వాక్రా సంఘాలకు ఉమ్మడి ఏపీలోనూ ప్రభుత్వాలు సాయం అందించాయి. మహిళలు ఆర్థికంగా నిలదొక్కునేందుకు వారితో కుట్టుపరిశ్రమలు ఏర్పాటు చేయించారు.అలాగే డ్వాక్వా ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించారు. గేదెలు కొనుగోళ్లు రుణాలు, గొర్రెల పెంపకానికి సాయం వంటివి చేశారు. మళ్లీ ఇప్పుడు రేవంత్రెడ్డి సర్కార్ మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు సాయం చేస్తున్నారు.

# పీర్జాదిగూడ కూల్చివేతలు దారుణం

## - ఇది పేద ప్రజలపై అధికార దాడి
## - కెసిఆర్ ఇలా చేసే మట్టి కారిచాడు
## - మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శలు

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డబ్బులు దండుకోవటం తప్ప పాలనపై ధ్యాస లేదని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీర్జాదిగూడ పరిధిలోని ప్రియ ఎన్ క్లేవ్లో పేదల ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిందంటూ ఈటెల తీవ్రంగా స్పందించారు. అన్ని అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్నా కూల్చివేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇలాంటి నియంతృత్వ పోకడలకు పోయే ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారని ఎద్దేవా చేశారు. రెవెన్యూ మంత్రికి తెలియకుండానే అధికారులు ఇళ్లు కూల్చివేస్తున్నారా అంటూ ప్రశ్నించారు. ప్రియ ఎన్ క్లేవ్లో ఇళ్లు నిర్మించుకున్న వారంతా చిన్నచిన్న ఉద్యోగులు, చిరువ్యాపారులు, పేదలే అని ఈటెల తెలిపారు. ఒకవేళ ఇవి అక్రమ భూములే అయితే జీహెచ్ఎంసీ అధికారులు గతంలో ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. దీని వెనక రాజకీయకుట్ర దాగి ఉందని ఈటెల ఆరోపించారు. ఇళ్లు నిర్మించుకున్న స్థలం ఇటీవల కాంగ్రెస్లో చేరిన రామ్ దాస్ గౌడ్ నుంచే బాధితులంతా కొనుగోలు చేశారని, పోచయ్య అనే కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీలో చేరకపోవడంతోనే వివాదానికి తెరతీశారని ఆరోపించారు. భయపెట్టి పార్టీలో చేర్చుకోవడం లేదంటే కేసులు పెట్టి జైళ్లకు పంపాలని చూసిన గత బీఆర్ఎస్ పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ వ్యవస్థలే వారిని హింసించే దౌర్భాగ్య పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ ఇలాంటి పరిస్థితి ఉండేదని, ఇప్పుడూ అలానే కనిపిస్తోందన్నారు. రెండు ప్రభుత్వాలకూ పెద్దగా తేడా ఏం లేదని ఎంపీ ఈటెల అన్నారు. 30, 40సంవత్సరాల కిందట కొనుగోలు చేసిన భూముల విషయంలో ఇప్పుడు రాద్ధాంతం చేయడంపై సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో 300మంది రోడ్డున పడ్డారని రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు ఉన్నా సరే పేదల ఇళ్లు కూల్చిన ఎమ్మార్వో, ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన అధికారులపై కేసులు పెట్టాలని ఎంపీ ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గంజాయి, సారా, మత్తుపదార్థాలు అరికట్టలేని కాంగ్రెస్ ప్రభుత్వం 200మంది పోలీసులతో ఇళ్లు కూల్చివేశారంటూ దుయ్యబట్టారు. కేసీఆర్ను ఓడించాలని మాత్రమే ప్రజలు కాంగ్రెస్కు అధికారం కట్టబెట్టారని చురకలు అంటించారు. కేసీఆర్ లాగానే రేవంత్ రెడ్డికి కూడా కళ్లు నెత్తికి ఎక్కాయని ధ్వజమెత్తారు. ఈ విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురి మంత్రులకు ఫోన్ చేసినా స్పందించ లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్యాయం జరిగిందనే ప్రజలు, ఉద్యమకారులు, మేధావులు కాంగ్రెస్ను గెలిపిస్తే వీరు అంతకు మించి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ దుర్మార్గాలను బీజేపీ నేతలు చూస్తూ ఊరుకోరని, ఇలాంటి చర్యలు పునరావృతం అయితే తగిన గుణపాఠం చెప్తామని ఎంపీ ఈటెల రాజేందర్ హెచ్చరించారు.

# ఆయుష్మాన్ పదిలక్షలకు పెంచే యోచన

న్యూఢిల్లీ,తెలంగాణ ముచ్చట్లు : ప్రతిష్ఠాత్మక ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని రూ.10లక్షలకు పెంచే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు వచ్చే బడ్జెట్లో ప్రతిపాదనలు చేసే అవకాశం ఉంది. అంతేకాదు రాబోయే మూడేళ్లలో ఈ పథకం కింద లబ్ధిపొందేవారి సంఖ్యను సైతం రెండితలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. తొలుత 70 ఏళ్లు పైబడిన వారిని ఈ పథకంలో భాగం చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ అధికారులు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపితే ఏటా ఖజానాపై మరో రూ.12,076 కోట్ల భారం పడనుందని, దేశంలో మూడింట రెండొంతుల మందికి ఆరోగ్య బీమా వర్తించనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిపాదనలన్నీ లేదా వీటిలో కొన్నింటిని రాబోయే కేంద్ర బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆయుష్మాన్ భారత్ యోజనను 70 ఏళ్లు పైబడిన వారికి సైతం విస్తరిస్తున్నట్లు జూన్ 27న జరిగిన పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మరో 4-5 కోట్ల మందికి ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరే అవకాశం ఉంది. దేశంలో ఎటువంటి ప్రయోజనాలు పొందని 30శాతం మందిని సైతం ఈ బీమా పరిధిలోకి తీసుకురావడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని అధికారిక వర్గాలు తెలిపాయి.

# ఉచిత చేపపిల్లల పంపిణీ ఉంటుందా?

## ప్రభుత్వ విధానం కోసం మత్స్యకారుల ఎదురుచూపు

ఆదిలాబాద్,జూలై8 తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసినా పెద్దగా ఫలితం కానరాలేదు. ఇదంతా ఓ ప్రచార కార్యక్రమంలా సాగింది. ఈ ఏడాది కూడా చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు పంపిణీ చేస్తారా లేదా అన్న అనుమనాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 68 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద 284 చెరువులలో 129.23 లక్షల చేప పిల్లల పంపిణీ చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో మత్స్యశాఖ పరిధిలో 62 చెరువులు, గ్రామ పంచాయతీ పరిధిలో 220, మరో రెండు రిజర్వాయర్లు ఉన్నాయి. చెరువులు, కుంటల్లో 35-40మి.మీ. సైజు రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో 80-100 మి.మీ. సైజు చేప పిల్లలను వదలనున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు రిజర్వాయర్లలో రొయ్య పిల్లలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసారు. మొత్తం 68 సొసైటీల పరిధిలో 4230 మంది మత్స్యకార్మికులున్నారు. పెంచిన చేపలను మార్కెట్కు తరలించి విక్రయించేందుకు కార్మికులకు వాహనాలు, వలలను సబ్సిడీపై ప్రభుత్వమే అందించింది. అయితే ఈ వ్యవహారంలో అంతా అవినీతి చోటుచేసుకుందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది కూడా చేప పిల్లలను వదిలేందుకు అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటనా చేయయలేదని అంటున్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిస్తే మరిన్ని చెరువులు, కుంటలలో చేప పిల్లలను పెంచాలని మత్స్యకారులు భావిస్తున్నారు. స్థానికంగా మంచి డిమాండ్ ఉన్న కట్ల, రోకు, బొచ్చ, బంగారు తీగ లాంటి చేప పిల్లలను సరఫరా చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల్లో చేపల మార్కెట్ను నిర్మించేందుకు స్థలాలను గుర్తించి ఇస్తామని గత సర్కార్ ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో అందుబాటులో ఉన్న రిజర్వాయర్, ప్రాజెక్టులలో రొయ్యల పెంపకం పై అధికారులు ప్రత్యేక దృష్టిని సారిస్తే ఉపాధి పురుగుతుందని అంటున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు, చిక్మాన్ ప్రాజెక్టులలో చేప పిల్లల పెంపకంతో పాటుయ్యల పెంపకంపై దృష్టి సారించారు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో ఏడాదంతా సరిపడా నీటి నిల్వలు ఉండే అవకాశం ఉండడంతో రొయ్యల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుందనిచెబుతున్నారు. అలాగే మార్కెట్లో రొయ్యలకు మంచి డిమాండ్ కూడా ఉండడవే వీటి పెంపకానికి ఆసక్తి చూపుతున్నారు. రొయ్యల పెంపకంతో మత్స్య కార్మికులకు 3 కాలాల పాటు ఉపాధి దొరకడంతో పాటు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కానీ చేపలు పెంచే రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో రొయ్యలను పెంచితే సరైన దిగుబడులు రావని మత్స్యకార్మికులు పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా రొయ్యల పెంపకానికి ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ యేడు జిల్లాలో సాధారణ వర్షపాతమే కనిపిస్తుంది. వానాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచి పోయిన అంతంత మాత్రంగానే వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగానే వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇప్పుడున్న పరిస్థితుల్లో చేప పిల్లలను వదలడం సాధ్యపడదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆశించిన స్థాయిలో చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు కనిపించడం లేదు. ఎగువ ప్రాంతంలో వర్షాలు కురవక పోవడంతో ఆశించిన స్థాయిలో వరదనీరు రావడం లేదు. భారీ వర్షాలు కురుస్తే కానీ ప్రాజెక్టుల్లోకి వరద నీరు చేరుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఈ ఏడు ఇప్పటి వరకు మోస్తారు స్థాయిలోనే వర్షాలు కురుస్తున్న భారీ వర్షాల జాడ కనిపించడం లేదు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU TELTEL12273 తెలుగు దిన పత్రిక

# యుద్ధప్రాతిపదికన స్కిల్ యూనివర్సిటీ

**- అసెంబ్లీ సమావేశాలకు ముందే ఏర్పాటు**
**- ఐఎస్‌బి తరహాలో బోర్డు ఏర్పాటుకు చర్యలు**
**- విద్యారంగ, పారిశ్రామిక ప్రముఖులలకు సూచన**
**- ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ సందర్శించిన సిఎం రేవంత్**





హైదరాబాద్,జూలై8 తెలంగాణ ముచ్చట్లు : రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరగాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరున జరిగే అసెంబ్లీ సమావేశాలకు ముందే జులై 23 లోపు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని పరిశ్రమల శాఖ, విద్యా శాఖ అధికారులతో పాటు పారిశ్రామిక రంగ ప్రముఖులకు సీఎం సూచించారు. వాటిని పరిశీలించి ఇరవై నాలుగు గంటల్లో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని ప్రకటించారు. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక ప్రముఖులతో ముఖ్యమంత్రి సోమవారం మధ్యాహ్నం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో స్కిల్ డెవెలప్మెంట్ పై సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుపై అధికారులతో పాటు ప్రముఖుల అభిప్రాయాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ప్రాంగణంలోనే స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అటు ఐటీ కంపెనీలతో పాటు ఇటు పరిశ్రమలన్నింటికీ అందుబాటులో ఉన్నందున ఈ సిటీ ప్రాంగణంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఐ.ఎస్.బీ తరహాలో ఒక బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని చర్చ జరిగింది. అప్పటివరకు ఈ సమావేశానికి హాజరైన ప్రతినిధులందరినీ తాత్కాలిక బోర్డుగా భావించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. స్కిల్ యూనివర్సిటీలో ఏమేం కోర్సులుండాలి, ఎలాంటి పాఠ్యాంశాలు ఉండాలి.. పరిశ్రమల అవసరాలు తెలుసుకొని, వాటికి అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు ఉండేందుకు ఏయే నైపుణ్యాలపై కోర్సులు నిర్వహించాలనేది ముందుగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. అధునాతన పరిజ్ఞానం అందించేలా ఈ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనేది తమ ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ఆర్థికపరమైన అంశాలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో, కరిక్యులమ్, కోర్సులకు సంబంధించి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో చర్చించాలని చెప్పారు. ర్ణీత గడువు పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలని, కేవలం 15 రోజుల వ్యవధి ఉన్నందున ప్రతీ అయిదు రోజులకోసారి సమావేశం కావాలని సీఎం వారికి దిశా నిర్దేశర చేశారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలా.. ప్రభుత్వమే ఈ బాధ్యతలను చేపట్టాలా... మరేదైనా విధానం అనుసరించాలా.. అనేది కూడా పరిశీలించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఔనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు, ప్రాజెక్టు రిపోర్టులన్నీ తయారు చేసేందుకు ఆ రంగంలో నిపుణులైన ఒక కన్‌స్టలెంట్ ను నియమించుకోవాలని సీఎం చెప్పారు. యూనివర్సిటీ వ్యవహారాలకు పరిశ్రమల శాఖ నోడల్ డిపార్టుమెంట్ గా వ్యవహరిస్తుందన్నారు. ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, ఇన్వెస్ట్ మెంట్స్ ప్రమోషన్ స్పెషల్ సెక్రెటరీ విష్ణు వర్ధన్ రెడ్డి, డాక్టర్ రెడ్డిస్ ల్యాబ్ ఛైర్మన్ సతీష్ రెడ్డి, భారత్ బయోటెక్ హరి ప్రసాద్, క్రెడాయ్ ప్రెసిడెంట్ శేఖర్ రెడ్డి, ఐ ల్యాబ్స్ శ్రీనిరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మావేశానికి ముందు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ ను ముఖ్యమంత్రి పరిశీలించారు. దాదాపు ఇరవై నిమిషాల పాటు కలియ తిరిగి అందులో ఉండే సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడే కాలేజీ సిబ్బందితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.

# ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

**- మౌలిక సదుపాయాలపై ఫార్మా కంపెనీలకు బాధ్యతలు**
**- కంపెనీ ప్రతినిధులతో రాష్ట్ర వైద్యారోగ్య మంత్రి దామోదర చర్చలు**

హైదరాబాద్,జూలై8 తెలంగాణ ముచ్చట్లు : ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనలకు ఫార్మా కంపెనీ ప్రతినిధులతో రాష్ట్ర వైద్యారోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమావేశం నిర్వహించారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల పూర్వ వైభవానికి సామాజిక బాధ్యతగా ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ నిధులను విరివిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో ప్రాధాన్యత రంగాలైన పేషెంట్ కేర్, శానిటేషన్, డైట్, బయో ? మెడికల్ వేస్టేజ్, డ్రింకింగ్ వాటర్ సప్లైలతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించటానికి అవసరమైన సిబ్బంది, విద్య, వైద్య రంగాలతో పాటు గర్ల్స్ చైల్డ్ ఎడ్యుకేషన్ లాంటి అంశాలలో ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ ఫండ్స్‌ను అందించాలని కోరారు. మంత్రి విజ్ఞప్తి మేరకు గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల బలోపేతానికి ఫార్మా కంపెనీలు తమ సీఎస్ఆర్ విధులను విడుదల చేసేందుకు సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని 12 ప్రముఖ ఫార్మా కంపెనీల ప్రతినిధులు ఈ వారంలో ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులను స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో ప్రాధాన్యత కలిగిన అంశాలపై టెక్నికల్‌గా నివేదికను సమర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులలో రోగులకు అవసరమైన, నాణ్యమైన, మెరుగైన సేవలను అందించేందుకు, మౌలిక సదుపాయాలు, మానవ వనరుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలను తక్షణమే సమర్పించాలని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల సూపరిండెంట్లను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండరాదు

**జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి**






బాపట్ల, తెలంగాణ ముచ్చట్లు : ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండరాదని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. 89అర్జీలు నమోదు కాగా, వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తన పరిధిలోని వాటిని తక్షణమే ఆయన పరిష్కరించగా, వీడియో సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. అర్జీలు పునరావృతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల వేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తే కుదరదన్నారు. చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. నీటి పన్నులు ఖచ్చితంగా వసూలు చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరైన అధికారులకు ఛార్జి మెమోలు జారీ చేయాలన్నారు.

# నేటినుంచి సిఎం రేవంత్ జిల్లాల పర్యటన

**నేడు సొంత జిల్లాలో పలు కార్యక్రమాలకు హాజరు**

హైదరాబాద్,జూలై8 తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం నుంచి జిల్లాల పర్యటన చేపట్టనున్నారు. ఇందులో భాగంగా తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. జిల్లా కలెక్టరేట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా ప్రముఖులతో సీఎం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయల్దేరనున్నారు. మ. 12.45 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటారు. మ. 12.45 నుంచి ఒంటి గంట వరకు కలెక్టరేట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఉమ్మడి జిల్లా ప్రముఖులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో అభివృద్ధిపై సమీక్షా నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 5.45 వరకు భూత్పూర్ రోడ్డులోని ఏఎస్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులతో సమావేశం కానున్నారు. సాయంత్రం 6 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండరాదు

**జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు**




పల్నాడు, తెలంగాణ ముచ్చట్లు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకున్నారు. 96 అర్జీలు నమోదు కాగా, వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తన పరిధిలోని వాటిని తక్షణమే ఆయన పరిష్కరించగా, వీడియో సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడి పరిష్కార మార్గం చూపారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. అర్జీలు పునరావృతం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల వేదిక కార్యక్రమానికి అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తే కుదరదన్నారు. చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది అందరూ శ్రద్ధతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. సోమవారం ప్రజా పిర్యాదులు పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. శ్రద్ధ, అంకిత భావంతో పనిచేసి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని అన్నారు. ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. పనిచేద్దాం – లక్ష్యాలు సాధిద్దాం అన్నారు. ప్రాథమిక రంగాలు, ఇంజినీరింగ్ రంగాలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు.

# సినిమా న్యూస్

# కల్కి బ్యూటీ జీరో సైడ్ అందాలు

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన కల్కి సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమాలో దీపికా పదుకునే కీలక పాత్రలో కనిపించగా, దిశా పటానీ గ్లామర్ రోల్ లో కనిపించి మెప్పించింది. ప్రభాస్ తో ఉన్న ఆమె సన్నివేశాలకు మంచి మార్కులు పడటంతో ఆమె స్థాయి మరింతగా పెరిగింది. కల్కి సినిమాకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియా ద్వారా విడుదల చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించారు. విభిన్నమైన ఔట్ ఫిట్ ను ధరించిన కల్కి బ్యూటీ దిశా పటానీ నడుము నాభి అందాలను చూపిస్తూ క్లీ వేజ్ షో తో మతి పోగొట్టింది అంటూ సినిమా చూసిన వారు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ఫోటోలను సోషల్ మీడియా ద్వారా చిత్ర యూనిట్ సభ్యులు రివీల్ చేయడం జరిగింది. ఈ ఫోటోల్లో దిశా పటానీ విభిన్నమైన మేకోవర్ తో పాటు నడుము నాభి అందాలు చూపిస్తూ క్లీవేజ్ షో చేసింది. ఆకట్టుకునే విధంగా ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. తెలుగు లో మొదటి సినిమాతో మెప్పించలేక పోయిన ఈ అమ్మడు ఇన్నాళ్ళు కు అయినా టాలీవుడ్ లో హిట్ ను దక్కించుకోవడం ఆనందంగా ఉందని సోషల్ మీడియాలో ఆమె ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముందు ముందు టాలీవుడ్ లో ఈ అమ్మడు మరిన్ని సినిమాలు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. పాన్ ఇండియా స్టార్‌డమ్ ఉన్న స్టార్ హీరోయిన్ అవ్వడం వల్ల ముందు ముందు సౌత్ లో పాన్ ఇండియా సినిమాలకు మోస్ట్ వాంటెడ్ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.





# రాధిక 3.0 ఎవరో తేలిపోయింది..!



సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటించిన డీజే టిల్లు మరియు టిల్లు స్క్వేర్ సినిమాలు మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా టిల్లు స్క్వేర్ సినిమాకు వచ్చిన ఆధరణ నేపథ్యంలో వెంటనే మూడో టిల్లు ను కూడా తీసుకు వస్తామని ప్రకటించారు. ఇప్పటికే అందుకు సంబంధించిన వర్క్ షురూ అయ్యిందని సమాచారం అందుతోంది. టిల్లు క్యూబ్ సినిమా కోసం ఇప్పటికే సిద్దు స్క్రిప్ట్ వర్క్ మొదలు పెట్టాడు అంటూ ఆయన సన్నిహితులు అంటున్నారు. సిద్దు చిన్న లైన్ తీసుకుని సెట్స్ పైకి వెళ్తాడు. దాన్ని ఆన్ లొకేషన్, షూటింగ్ సమయంలో డెవలప్ చేస్తూ వెళ్తాడు అంటూ టిల్లుకు వర్క్ చేసిన టెక్నీషియన్స్ కొందరు చెప్పుకొచ్చారు. ఆ విషయం పక్కన పెడితే సిద్దు జొన్నలగడ్డ కి జోడీగా మొదటి టిల్లులో నేహా శెట్టి హీరోయిన్ గా నటించింది. రాధిక గా ఆమె పాత్రకు మంచి మార్కులు పడ్డాయి. ఇప్పటికి కూడా రాధిక పేరు మారు మ్రోగుతూనే ఉంది. టిల్లు స్క్వేర్ లో హీరోయిన్ గా అనుపమ పరమేశ్వరన్ నటించింది. లిల్లీ గా ఆమెను చూపించినా కూడా రాధిక 2.0 గా అంతా మాట్లాడుకున్నారు. ఇప్పుడు టిల్లు క్యూబ్ లో రాధిక 3.0 గా ఎవరు నటించబోతున్నారు అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం తెలుగు అమ్మాయి అయిన ప్రియాంక జవాల్కర్ ను ఎంపిక చేశారు అంటూ సమాచారం అందుతోంది. సిద్దు జొన్నలగడ్డ హీరోయిన్ ఎంపిక పర్ఫెక్ట్ గా ఉంటుందని గతంలో నిరూపితం అయ్యింది. కనుక ఈసారి కూడా ప్రియాంక జవాల్కర్ ఎంపిక కచ్చితంగా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవడం ఖాయం అన్నట్లుగా టిల్లు ఫ్యాన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విజయ్ దేవరకొండ తో టాక్సీవాలా సినిమాలో నటించిన ముద్దుగుమ్మ ప్రియాంక జవాల్కర్ ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి మెప్పించింది. అయితే స్టార్స్ కు జోడీగా నటించే అవకాశాలు రాకపోవడంతో కెరీర్ ఖతం అనుకున్నారు. అనూహ్యంగా టిల్లు గాడి లవర్ పాత్ర ఈ అమ్మడికి లభించింది. దీంతో ఈ అమ్మడి కెరీర్ యూటర్న్ తీసుకుంటుందేమో చూడాలి.


# జాన్వీ పీకాక్ లుక్ వైరల్



నేటితరం అందాల యువ నాయిక జాన్వీకపూర్ పరిచయం అవసరం లేదు. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా సినీ ఆరంగేట్రం చేసిన జాన్వీ తన ధైన అందం నటన తో మంత్ర ముగ్ధులను చేస్తోంది. నటించిన కొద్ది సినిమాలతోనే మంచి పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ ఇప్పుడు దేవర సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెడుతోంది. ముఖ్యంగా సోషల్ మీడియాల్లో జాన్వీకి ఉన్న ఫాలోయింగ్ తెలిసిందే.తాజాగా జాన్వీ కపూర్ సోషల్ మీడియాల్లో షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఇందులో నెమలి పింఛముల డిజైనర్ లెహంగాలో హొయలొలికిస్తూ కనిపించింది జాన్వీ. నిజంగా నెమలి నడిచొచ్చినట్టుగా ఉంది! అంటూ అభిమానులు మైమరిచి చూస్తున్నారు ఈ లుక్ ని. ఈ డిజైన్ నిజానికి జాన్వీకి యూనిక్ లుక్ తెచ్చింది. ఇక జాన్వీ ధరించిన టాప్ ఎంతో ట్రెండీగాను కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ బ్యూటిఫుల్ డిజైనర్ లుక్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలు జాన్వీ కపూర్ త్వరలో టాలీవుడ్ లో అడుగుపెట్టబోతోంది. కెరీర్ ఆరంభమే టాలీవుడ్ సూపర్ స్టార్లు ఎన్టీఆర్, చరణ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. దేవరలో ఎన్టీఆర్ తో రొమాన్స్ చేస్తున్న జాన్వీ, తదుపరి చరణ్ – బుచ్చిబాబు చిత్రంలోను నటిస్తోంది. జగదేక వీరుడు అతిలోక సుందరి సీక్వెల్ తెరకెక్కిస్తే అందులో కచ్చితంగా జాన్వీ కథానాయిక అని చరణ్ కన్ఫామ్ చేసాడు. దీనికోసం అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారని బుచ్చిబాబుతో సినిమా లాంచ్ లో చరణ్ స్వయంగా అన్నారు.

# తాప్సీని బాలీవుడ్ ఎగతాళి చేసిందా?

తాప్సీ కొంత కాలంగా బాలీవుడ్ లోనే సినిమాలు చేస్తోన్న సంగతి తెలిసిందే. టాలీవుడ్ కంటే బాలీవుడ్ లో బెటర్ గానే కొనసాగుతుంది. అక్కడికి వెళ్లిన తర్వాత సొంతంగా నిర్మాణ సంస్థని సైతం స్థాపించి పరిమిత బడ్జెట్ లో సినిమాలు నిర్మిస్తుంది. అక్కడి సెలబ్రిటీలందరితో అంతే మింగిల్ అవుతుంది. అక్కడే స్థిరపడాలి అన్న ఉద్దేశంతో అమ్మడు బాలీవుడ్ లో ముందుకు సాగుతుంది. అందుకు తగ్గ ప్రణాళిక వేసుకుని వెళ్తుంది. దాదాపు గా నాలుగైదేళ్లగా అక్కడే బిజీగా ఉంది. గత ఏడాది ఒకే ఒక్క సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చినా ఈ ఏడాది మాత్రం నాలుగైదు సినిమాలో రావడం పక్కాగా కనిపిస్తుంది. ఇప్పటికే కొన్ని కమిట్ అయిన ప్రాజెక్ట్ లు ఉన్నాయి. అవి షూటింగ్ దశలో ఉన్నాయి. మరికొన్ని చర్చల దశలో ఉన్నాయి. లాక్ అయితే ఏడాది ముగింపుకల్లా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు వచ్చేయడం ఖాయం.



**Publisher, Printer, Owner Bollepaka Rajesh,** H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State. Printed at Amulya publications & printers and graphics. Place of Publication H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State, Pin code : 506151. **Editor : Bollepaka Rajesh. 9493669669**
**TELTEL12273** Website : www.telanganamuchatlu.in "Mail I'd: telanganamuchatlu.in@gmail.com